క్లుప్తంగా

గెలిచినా, ఓడినా ప్రజలతోనే ప్రయాణం

గోకవరం: గెలుపోటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం ప్రజలతోనేని జగ్గంపేట స్వతంత్ర్య అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేసి మద్యం, డబ్బు పంచకపోయినా ప్రజలు నాపై నమ్మకంతో 12,351 ఓట్లు వేశారన్నారు. తనకు ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజాసమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేస్తానన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలు తొలగించారు. డ్రైన్లలో పూడిక తీత తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

సిమెంట్ లారీ నిలిపివేతతో ట్రాఫిక్‌కు అంతరాయం



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో అడ్డంగా నిలిపేసిన లారీ

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో సిమెంటు లారీని రోడ్డుకు అడ్డంగా నిలిపేయడంతో మంగళవారం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఓ సిమెంట్ వ్యాపారి కంపెనీ నుంచి వచ్చిన సిమెంట్‌ను అన్‌లోడ్ చేయడానికి లారీని రోడ్డుకు అడ్డుగా నిలిపేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చిన్నతనం నుంచే భాషా పరిజ్ఞానం అవసరం

పెద్దాపురం: విద్యార్థులు చిన్నతనం నుంచే తెలుగు భాషా పరిజ్ఞానం పెంపొందించుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పనుల్లో బిజీబిజీ

- వేసవి దుక్కులతో భూముల చదును
- నీటి అనుకూలతను బట్టి సార్వా పంటల ఎంపిక



గుమ్మరేగుల వద్ద ట్రాక్టర్‌తో భూమిని దున్నుతున్న రైతు

రౌతులపూడి: నైరుతి రుతుపవనాలు పలకరించాయి. వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయి. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి తరుణంలో రైతులు వేసవి దుక్కలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల అక్కడికక్కడా కురిసిన కొద్దిపాటి వర్షాలకు రైతులంతా తమ భూములను సదును చేసుకుని దుక్కులకు ఉపక్రమిస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సాగుకోసం రైతులంతా తమభూములను దుక్కులు చేసుకునే పనిలో పడ్డారు. వర్షాలు అనుకూలిస్తే మండలంలో ఈ ఏడాది సుమారు ఐదువేల ఎకరాల్లో వరి, రెండు వేల ఎకరాల్లో ప్రత్తి, మరో ఐదువందల ఎకరాల్లో కూరగాయలు సాగు చేసేందుకు రైతులంతా తమ భూములను సిద్ధం చేసుకుంటున్నారు. ముందుగా దుక్కులు చేసుకుని రైతులంతా వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడి సాధించేందుకు వీలుంటుందని అధికారుల పేర్కొంటున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

వేసవి దుక్కులు చేసుకునే రైతులంతా ముందుగా భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు పేర్కొన్నారు. భూసార పరీక్షలు వల్ల నేలలో ఏ మోతాదులో పోషకాలు ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. తద్వారా పోషకాలు(నత్రజని, పొటాషియం వంటి రసాయనాలు) సమతుల్యత ఉండేలా చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని తెలిపారు. ఈ విధంగా తక్కువ ఖర్చుతో దిగుబడిని పెంచుకోవచ్చని ఆయన అన్నారు. నేలల్లోని చవుడు, ఆమ్లం గురించి ముందుగానే తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. వేసవి దుక్కులు వల్ల నేలలో ఉన్న అవశేషాలు (పురుగులు, కీటకాలు, తెగుళ్ల, కలుపు మొక్కల్లో కుళ్లిన అవశేషాలు) నశించిపోయి సారవంతమైన భూమిగా తయారు చేసుకోవచ్చన్నారు. దుక్కిలో వేపపిండి వేయడం ద్వారా(అజాడీ రెక్టిన్) పురుగుల తీవ్రతను తగ్గించుకోవచ్చనని వ్యవసాయాధికారి సూచించారు. భూములను లోతుగా దున్నడం వలన వర్షపునీరు భూమికలోకి ఇంకి భూగర్భ నీటిమట్టం పెరుగుతుందన్నారు. భూమిని లోతుగా దున్నడంతో మొక్కల వేర్లు లోతుగా చేరుకుని మొక్కలు వేపుగా పెరుగుతాయన్నారు. వర్షాలు అనుకూలిస్తే వరి, లేకుంటే పత్తిసాగుకు అనుకూలంగా పంటలు మార్పులు చేసుకోవచ్చనని ఆయన రైతులకు సూచించారు.

రాయితీలను వినియోగించుకోవాలి

ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న రాయితీలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలి అందుబాటలో ఉన్న వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలి. రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించే మేలు రకం అధునాతన వ్యవసాయ పరికరాలు, రసాయినాలు, క్రిమి సంహారిక మందులు, విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

– రెడ్డి ఈశ్వరరావు, మండల వ్యవసాయాధికారి, రౌతులపూడి

నేటి నుంచి నీలమ్మ తల్లి జాతర



సామర్లకోటలో ఉన్న నీలమ్మ తల్లి

సామర్లకోట: స్థానిక నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటి కోసం సుమారు 130 ఏళ్ల క్రితం పట్టణ ముఖ్యకూడలి ప్రదేశంలో చెరువు తవ్వుతున్న సమయంలో చిన్న రాతి విగ్రహం బయట పడింది. ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో చెరువుకు నీలమ్మ చెరువుగా పేరు వచ్చింది. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి రోజూ ధూపదీప నైవేద్యాలు పెటట్టంతో పాటు ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి జాతరలో సిరి బొమ్మ ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. ఉత్సవాల కోసం నీలమ్మ తల్లి ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలకరణ చేశారు. జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

టీడీపీ అభ్యర్థుల విజయం



ఎమ్మెల్యేగా డిక్లరేషన్ ఫామ్ అందుకుంటున్న జ్యోతుల నెహ్రూ



కాకినాడ జేఎన్‌టీయూ వద్ద యనమల దివ్యను కలిసిన టీడీపీ శ్రేణులు



రిటర్నింగ్ అధికారి నుంచి డిక్లరేషన్ ఫారం అందుకుంటున్న వరుపుల సత్యప్రభ

తుని: సార్వత్రిక ఎన్నికల్లో తుని నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి యనమల దివ్య విజయం సాధించారు. మంగళవారం కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన ఓట్ల లెక్కింపులో యనమల దివ్య విజయం సాధించినట్టు ఆర్‌ఓ కేవీ రామలక్ష్మి తెలిపారు. యనమల దివ్య తన సమీప అభ్యర్థి మంత్రి దాడిశెట్టి రాజాపై 15,681 ఓట్ల మెజారిటీ సాధించారు. దివ్యకు 95,836 ఓట్లు రాగా మంత్రి దాడిశెట్టి రాజాకు 81,295 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి గేలం శ్రీనివాసరావు 1,808 ఓట్లు సాధించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,24,981 కాగా 1,87,621 ఓట్లు పోలయ్యాయి. దివ్యకు ఈవీఎంల లెక్కింపులో 14,541 ఓట్ల మెజారిటీ రాగా పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 1,140 ఓట్లతో కలిపి 15,681 ఓట్లు వచ్చాయి. యనమల దివ్య భారీ విజయం సాధించడంతో కూడమి సభ్యులు, సంబరాలు జరుపుకొన్నారు.

కోటనందూరులో..

కోటనందూరు: సార్వత్రిక ఎన్నికల్లో మండలం నుంచి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని యనమల దివ్య స్వల్ప ఆధిక్యతతో విజయం పొందారు. కోటనందూరు మండలంలో 17 పంచాయతీల పరిధిలో మొత్తం ఓటర్లు 39,656 ఉండగా 34,799 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ అభ్యర్థిని యనమల దివ్య తన సమీప ప్రత్యర్థి, మంత్రి దాడిశెట్టి రాజా కన్నా 359 ఓట్ల ఆధిక్యత సాధించారు. ఎనిమిది పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ ఆధిక్యత సాధించగా ఏడు పంచాయతీల్లో టీడీపీ విజయం సాధించింది. యనమల దివ్య విజయంతో మండలంలోని టీడీపీ, జన సేన నాయకులు, అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నాయి.

ప్రత్తిపాడులో టీడీపీ విజయం

ఏలేశ్వరం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ విజయం సాధించారు. తొలిసారిగా పోటీ చేసిన సత్యప్రభ సమీప ప్రత్యర్థి వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావుపై 38,768 మెజార్టీతో గెలుపొందారు. పోలైన ఓట్లలో సత్యప్రభకు 1,03,002, వరుపుల సుబ్బారావుకు 64,234, కాంగ్రెస్ అభ్యర్థి సీరుకొండ సత్యనారాయణకు 1354 ఓట్లు వచ్చాయి. గెలుపొందిన అనంతరం సత్యప్రభ రిటర్నింగ్ అధికారి రాజేష్ జోగ్‌పాల్ చేతుల మీదుగా డిక్లరేషన్ ఫారం అందుకున్నారు. సత్యప్రభ వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేటలో జ్యోతుల నెహ్రూ విజయం

గోకవరం: జగ్గంపేట ఎమ్మెల్యేగా టీడీపీఅ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ విజయం సాధించారు. జ్యోతుల నెహ్రూకు 1,13,593 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహంకు 60,917 ఓట్లు వచ్చాయి. అలాగే స్వతంత్ర్య అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర 12,531 ఓట్లు సాధించారు. జ్యోతుల నెహ్రూ సమీప ప్రత్యర్థి తోట నరసింహంపై 52,676 ఓట్లు మెజార్టీ లభించింది. లెక్కింపు అనంతరం రిటర్నింగ్ అధికారి నుంచి ఆయన డిక్లరేషన్ ఫారం అందుకున్నారు.

విజ్ఞానం తెరుచుకునేదెప్పుడో..!

- 15 ఏళ్లుగా కలగా మ్యూజియం
- నెరవేరని దాత ఆశయం



పెద్దాపురం మున్సిపల్ పార్కులో మ్యూజియానికి చెందిన భవనం

సామర్లకోట: నియోజకవర్గంలోని పెద్దాపురం ముఖ్య కూడలిలో కొన్నేళ్లుగా మ్యూజియం తెరుచుకోవడం లేదు.. ప్రజలకు విజ్ఞానం, వినోదం అందించే దీని నిర్వహణపై శీతకన్ను పడింది. పెద్దాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పార్కులో మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపాలిటీ స్థలం కేటాయించడంతో బచ్చు ఫౌండేషన్ అధినేతలు ముందుకు వచ్చి సుమారు రూ. కోటితో 2009లో భవన నిర్మించారు. ఈ భవనాన్ని అప్పటి కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి మల్లిపూడి మంగపతి పల్లంరాజు ప్రారంభించారు. ఈ మ్యూజియంలో జిల్లాతో పాటు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన చారిత్రాత్మక పరికరాలు ఉంచాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ మ్యూజియంపై శ్రద్ధ చూపిన దాఖలాలు కనిపించడం లేదు. మ్యూజియం ప్రారంభించి పర్యాటక పురావస్తు శాఖ అధికారులకు అప్పగించగా, వారి నిర్లక్ష్యం కారణంగానే ప్రజలకు అందుబాటులోకి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వివిధ అంశాలకు నిలయంగా..

ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, రాజులకు చెందిన విషయాలు, రాజకీయ అంశాలు, పురావస్తు శాఖకు సంబంధించిన అనేక చిత్రపటాలు, విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఆలోచన చేశారు. దీంతో పాటు ఆయా రాష్ట్రాలలో ఉన్న ప్రసిద్ధి. ఆ రాష్ట్రాలు చేరుకోవడానికి రూట్ మ్యాప్‌లను కూడా రూపొందించి ప్రజలు సులభంగా ఆయా క్షేత్రాలను దర్శించుకునే విధంగా చూడాలని భావించారు. అయితే పెద్దాపురం మున్సిపాలిటీ, పురావస్తు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ఇది అక్కరకు రావడం లేదు.

వినియోగంలోకి వస్తే మంచిది

మ్యూజియంలో ప్రతి జాతీయ నాయకునికి సంబంధించిన జీవిత చరిత్రతో పాటు ఆయా పురాతన కట్టడాలు, వాటి నిర్మాణ అంశాల చరిత్రతో కూడిన పుస్తకాలు ఏర్పాటు చేయాలని భావించారు. ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు విజ్ఞానంతో పాటు వినోదం కలుగుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే వారి ఆనందం కలగానే మిగిలిపోయింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఉన్న హ్టారికల్ మ్యూజియాన్ని తెరిపించాల్సిన బాధ్యత కూడా మున్సిపాలిటీపైనే ఉంది. ఈ భవనం నిర్మించిన స్థలంలో మున్సిపల్ పార్కు ఉండటంతో ప్రస్తుత వేసవిలో ఉదయం, సాయంత్రం అనేక మంది పార్కులో కాలక్షేపం చేస్తున్నారు. ఈ పార్కు సమీపంలోనే పెద్దాపురం గ్రంథాలయం ఉండటంలో గ్రంథాలయానికి వచ్చిన వృద్ధులు, ఆ పార్కులో విశ్రాంతి తీసుకొంటున్నారు. మ్యూజియం వినియోగంలోకి తీసుకు వస్తే భావితరాలకు విజ్ఞానదాయకంగా ఉంటుంది.

పచ్చదనం పెంచు.. అందరికీ పంచు

- జేఎన్‌టీయూకేలో వినూత్న ప్రయోగం
- మినీ ఫారెస్ట్, జంగిల్ బుక్ ఏర్పాటు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

బాలాజీచెరువు: పర్యావరణ హితం అందరి అభిమతం కావాలి.. ఈ నినాదం చైతన్యం నింపాలి.. పచ్చదనం పెంచేలా, ప్రతి ఒక్కరూ ఆచరించేలా జేఎన్‌టీయూకే ముందుకు సాగుస్తోంది.. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు పాఠ్యాంశాల్లో బోధనే కాకుండా వాటిని క్షేత్ర స్థాయిలో ఆచరించే విధంగా జేఎన్‌టీయూ యంత్రాంగం కృషి చేస్తుంది. జగనన్న హరిత నగరాలు పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టగా, ఈ బాటలో యూనివర్సిటీ పయనిస్తుంది. కాకినాడ నగర నడిమధ్యలో ఉన్న జేఎన్‌టీయూ వర్సిటీ దాదాపు 70 ఎకరాల్లో విస్తరించి ఉంది. అందులో సగం వరకూ ఖాళీస్థలం ఉంది. ఈ ప్రాంతాల్లో మొక్కలు నాటి పచ్చదనం నింపాలని వర్సిటీ భావించింది. రహదాలకు ఇరువైపులా పచ్చదనంతో పాటు ఖాళీ ప్రాంతాల్లో వివిధ జాతులకు చెందిన మొక్కలను నాటడానికి చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా గత ఏడాది జూన్‌లో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌లో అవుట్ స్టాండింగ్ పెర్మార్మెన్స్ సర్టిఫికెట్ సాధించింది. గ్రీన్ క్యాంపస్ ఆడిట్‌కు సంబంధించి 2021–22కు గాను ఆడిటింగ్‌లో గ్రీన్ క్యాంపస్ ఎకోస్కోర్ 53 శాతం పొందింది. ఈ ఏడాదికి 65 శాతం సాధించేలా కృషి చేస్తుంది. ఎనర్జీ సీవరేజ్ (వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్), కార్బన్ క్రెడిట్స్ (కార్బన్ ఉదారాలు) గ్రీన్ బిల్డింగ్, ఇ–వేస్ట్ మేనేజ్‌మెంట్, టెర్రస్ ఫార్మింగ్, కంపోస్టింగ్ వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని స్కోర్ విడుదల చేశారు. నేషనల్ అక్రిడేషన్ బోర్డు లిమిటెడ్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో సర్వే చేసి ర్యాంక్ విడుదల చేస్తారు.

మొక్కలు నాటి.. సంరక్షించి

జపాన్‌కు చెందిన వ్యక్తి రూపొందించిన మియావాకీ (మినీ ఫారెస్ట్) ప్లాంటేషన్ జేఎన్‌టీయూకేలో ఏర్పాటు చేశారు. ప్రధాన గ్రంథాలయం పక్కన 2020 సంవత్సరంలో 2,020 మొక్కలను ఆరెకరానికి పైగా స్థలంలో అన్ని రకాల మొక్కలు నాటి దాని మినీ ఫారెస్ట్‌గా రూపొందించారు. ఇది ఆహ్లాదాన్ని పంచుతోంది. ఎంత ఉష్ణోగ్రత ఉన్నా ఈ ఫారెస్ట్ కాస్త వరకూ చల్లగా ఉంటుంది.



చెట్ల కింద జంగిల్‌బుక్ పేరుతో విద్యా బోధన

జంగిల్ బుక్ పేరుతో..

పూర్వ గురుకుల పాఠశాల తరహాలో డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ బిల్డింగ్ వద్ద జంగిల్ బుక్ పేరుతో వృక్షాల మధ్య విద్యార్థులకు తరగతులు బోధించే విధానం తీసుకు వచ్చారు. పచ్చని వాతావరణం మధ్య చెట్ల కింద బల్లలపై కూర్చుని పాఠాలు వినే విధంగా రూపొందించారు. పై రెండు సరికొత్త ప్రాజెక్టులు అప్పుడు వర్సిటీ గ్రీన్ ఇన్షియేటివ్ డైరెక్టర్‌గా, ప్రస్తుతం డీఏపీగా ఉన్న ప్రొఫెసర్ మురళీకృష్ణ రూపొందించి క్యాంపస్ పచ్చదనంతో ఉండే విధంగా కృషి చేస్తున్నారు.

పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన



ఏలేశ్వరం గ్రంథాలయంలో పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీరబాబు

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పడాల చారిటబుల్‌ట్రస్టు ప్రతినిధి ఉగ్గిరాల వీరబాబు డిజిటల్ స్క్రీన్‌పై విద్యార్థులకు పర్యావరణంపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణ బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యవరణానికి కాపాడవల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యవరణ పరిరక్షణకు విద్యార్థులు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు విధిగా విజ్ఞాన శిబిరాలకు హజరుకావాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిపాజిట్లు కోల్పోయిన 9 మంది అభ్యర్థులు

తృతీయ స్థానం నోటాదే

తుని రూరల్: తుని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన 11 మందిలో తొమ్మిది మంది డిపాజిట్లను కోల్పోగా కనీసం తృతీయ స్థానం సైతం దక్కలేదు. డిపాజిట్లు లభించాలంటే పోలైన ఓట్లలో ఆరు శాతం ఓట్లు రావలసి ఉంది. తృతీయ స్థానంలో 3416 ఓట్లతో నోటా నిలిచింది. టీడీపీ అభ్యర్థి యనమల దివ్యకు 95,836, వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజాకు 81,295 ఓట్లు లభించగా గెలం శ్రీనివాసరావుకు (కాంగ్రెస్–ఐ) 1908 ఓట్లు, కర్రి నూకరాజుకు (బీఎస్పీ) 804 ఓట్లు, డి.సతీష్‌కు (డీబీపీ) 390 ఓట్లు, యాదాల రామకృష్ణకు (ఆర్‌పీఐ) 498 ఓట్లు, వాడబోయిన శివ (సీపీఐ-మార్కిస్టు లెనినిస్ట్) లిబరేషన్ 232 ఓట్లు, ఇండిపెండెంట్ అభ్యర్థులు కోనా రామకృష్ణకు 1177 ఓట్లు, తమరాన అప్పారావుకు 1006 ఓట్లు, బోడసాటి శ్రీనివాసరావు 439 ఓట్లు, వేగి ఆది వెంకట సత్యనారాయణకు 301 ఓట్లు లభించాయి. నోటాకు 3416 ఓట్లు పోలయ్యాయి. 16 రౌండ్లలో జరిగిన ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ నోటాకు తృతీయ స్థానం లభించింది.

ఎరువుల యాజమాన్యం కీలకం

- మితిమీరిన ఎరువుల వాడకంతో అనర్థం
- సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలంటున్న వ్యవసాయాధికారులు



కోటనందూరులో తయారు చేసిన వరి నారుమడి

కోటనందూరు: రైతులకు ఆదాయంతో పాటు ఆరోగ్యాన్ని ఇచ్చే ఖరీఫ్ వరిసాగులో ఎరువుల యాజమాన్యం కీలకం. భూసార పరీక్షల ఆధారంగా నేల పరిస్థితిని బట్టి ఎరువులను అవసరం మేర వినియోగిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చు. మితిమీరిన ఎరువుల వినియోగంతో ఆరోగ్యంతో పాటు దిగుబడి కూడా కోల్పోయే ప్రమాదముంది. ప్రధాన, కాంప్లెక్స్ ఎరువుల వినియోగంలో రైతులు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడి లభిస్తుంది. రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన పెంచుకొని సాగులో పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. అలాగే పశువుల పెంట(గెత్తం), పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారవంతమై భవిష్యత్‌కు భరోసాగా నిలుస్తుందని చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఈ ఏడాది తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో 40 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేసే అవకాశం ఉంది. నైరుతి దూసుకొస్తున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. బోర్ల కింద ఇప్పటికే నారు మడులను సిద్ధం చేస్తుంటుండగా మరో 10 రోజుల్లో పనులు ఊపందుకునే అవకాశం కనిపిస్తుంది. వరి సాగులో యూరియా, డీఏపీతో పాటు పొటాష్‌ను తగిన మోతాదులో వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎకరం పొలానికి ఎరువులు క్రింది విధంగా వాడాలని వారు చెబుతున్నారు.

ప్రధాన ఎరువుల వినియోగం

ఎకరం పొలానికి 5 సెంట్ల విస్తీర్ణంలో నారుమడి తయారు చేసుకోవాలి. విత్తనాలు చల్లిన తరువాత నాలుగు కేజీల డీఏపీ, రెండు కేజీల యూరియా, కేజీ పొటాష్ కలిపి వేస్తే ఆకు వేపుగా ఎదుగుతుంది. అలాగే మొదటి దమ్ములో మూడు బస్తాల సూపర్, బస్తా డీఏపీ, ఉడిచే ముందు 35 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ కలిపి వాడాలి. పొలం ఉడిచిన 45 రోజుల తరువాత 45 కేజీల యూరియా, 12 కేజీల పొటాష్ వేసుకోవాలి. పొట్ట దశలో మరో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ కలిపి వాడాలి. 60 రోజుల వ్యవధిలో 35 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చొప్పున వేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి.

పొటాష్ లోపంతో ప్రమాదం

సాధారణంగా రైతులు వరిసాగులో యూరియా డీఏపీలకు అధిక ప్రాధాన్యమిస్తూ పొటాష్ వినియోగంపై ఆశక్తి చూపడం లేదు. పొటాష్ లోపం కారణంగా గింజ గుల్లబారి బరువు తగ్గిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగులో పొటాష్ వినియోగంపై దృష్టి సారించాలని చెబుతున్నారు. పొటాష్ వినియోగాన్ని పట్టించుకోకపోతే రైతుల భారీగా నష్టపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

గెత్తం, పచ్చిరొట్టతో సారవంతం

పంట సాగు చేసే పొలంలో దమ్ము చేయడానికి 15 రోజుల ముందు పశువుల పెంట(గెత్తం), జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట ఎరువులు వాడితే భూమి సారవంతమై అధిక దిగుబడులు వస్తాయి. వీటి వినియోగంతో భవిష్యత్‌లో కూడా భూమి సారం తగ్గిపోకుండా ఉంటుంది.

సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలి

తక్కువ ఖర్చుతో మంచి ఫలితాలు ఇచ్చే సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మితిమీరిన రసాయనిక ఎరువుల వాడకంతో అనారోగ్య దిగుబడులతో పాటు నేల నిస్సారమైపోతుందని హెచ్చరిస్తున్నారు. కొద్దిగా కష్టమైనా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేంద్రియ ఎరువులను తయారు చేసుకొని వినియోగిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చని చెబుతున్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం



వరి సాగులో ఎరువుల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలి. రైతు బరోసా కేంద్రాలో రైతులకు సమావేశాలు ఏర్పాటు చేసి ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. సమగ్ర ఎరువుల యాజమాన్యంతో ఖరీఫ్ సాగులో మంచి దిగుబడులు వస్తాయి. రైతుభరోసా కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సేంద్రీయ ఎరువుల వైపు రైతులు అడుగు లేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.

– కేజే చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి, కోటనందూరు